
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 23 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.38,650

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,650 పలికాయి. మార్కెట్‌కు 85 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.26

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.9°/14.1°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

భద్రత కట్టుదిట్టం



భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సత్యసాయి జయంత్యుత్సవాల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక సాయిఆరామంలో బందోబస్తు విధుల్లో ఉంటున్న సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 48 మంది ఎస్‌ఐలు, 171 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 300 మంది కానిస్టేబుళ్లు, 26 మంది మహిళా పోలీసులు, 170 హోంగార్డులతోపాటు స్పెషల్ పార్టీ సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి లోపాలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. జయంత్యుత్సవాల్లో పాల్గొనే వీవీఐపీలు, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వర్తించాలన్నారు. పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించి వేడుకలను ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బీ అభ్యర్థుల కోసం ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ఆర్ఆర్‌బీ (రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25, 26, 27వ తేదీల్లో హుబ్లీ-కర్నూలు సిటీ (07315) మధ్య నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ రైలు హుబ్లీ జంక్షన్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి కర్నూలు రైల్వేస్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.00 గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 25, 26, 27, 28వ తేదీల్లో ఈ రైలు కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి హుబ్లీ జంక్షన్‌కు సాయంత్రం 4.15 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్, బళ్లారి, గుంతకల్లు, డోన్ మీదుగా రాకపోకలు సాగిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అందుబాటులోకి మెగా సప్లి హాల్‌టికెట్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ఈ నెల 23 నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ మూడు, ఐదు, ఏడు సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. మెగా సప్లిమెంటరీకి సంబంధించి మూడు, ఐదు సెమిస్టర్ అభ్యర్థులకు రెగ్యులర్ వారితో పాటు పరీక్షలు నిర్వహించనున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దంపతులు గంగన్న, నరసమ్మ

ముదిగుబ్బ: పెళ్లిలో ఏడడుగులు వేసినప్పటి నుంచి ఒకరికొకరు తోడుగా ఉంటూ బతుకు బండిని లాగుతూ వచ్చారు. రక్తసంబంధీకులు ఉన్నా.. ఎవరిపైనా ఆధారపడకుండా సొంత కష్టంతోనే జీవనం సాగిస్తున్నారు. అలా సాగిపోతున్న వారి దాంపత్య జీవితంలోకి మలిదశలో మృత్యువు తొంగిచూసింది. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు. వివరాలు... ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన గంగన్న (80), నరసమ్మ (74) దంపతులు శుక్రవారం రాత్రి ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి ఆటోలో చేరుకున్నారు. రోడ్డుకు అటు వైపు దిగిన వారు గ్రామంలోకి వెళ్లేందుకు రహదారిని దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. కాగా, వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.




వేదికపై ఆసీనులైన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం, సత్యసాయి యూనివర్సిటీ ప్రముఖులతోపాటు ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్, స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సత్య మందిరం.. జ్ఞాన సౌరభం

అంబరం.. స్నాతక సంబరం

- ఘనంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న సేతురామన్ పంచనాథన్
- నమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు
- 463 మందికి పట్టాల అందజేత
- 22 మందికి బంగారు పతకాలు, 14 మందికి డాక్టరేట్లు ప్రదానం

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో విద్యాసౌరభాలు విరబూశాయి. సత్య మందిరంలో జ్ఞాన కాంతులు ప్రకాశించాయి. స్వర్ణపతకాలు దక్కిన వేళ ప్రతి విద్యార్థి మోములోనూ ఆనందం వెల్లివిరిసింది. బిడ్డల పట్టాభిషేకం చూసి తల్లిదండ్రులు ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. ఈ అద్భుత ఘట్టానికి పూర్ణచంద్ర ఆడిటోరియం వేదికైంది. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. వర్సిటీ చాన్సలర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవానికి యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో 463 మందికి పట్టాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 మందికి బంగారు పతకాలు, మరో 14 మందికి డాక్టరేట్లు ప్రదానం చేశారు.

'ఐ ఓపెన్ కాన్వొకేషన్' అని పలికిన సత్యసాయి..

సత్యసాయి జయంత్యుత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణచంద్ర ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, బోర్డు డైరెక్టర్ల బృందం పూర్ణ చంద్ర ఆడిటోరియానికి ర్యాలీగా చేరుకుంది. అనంతరం ఫౌండర్ చాన్సలర్ సత్యసాయిబాబా 'ఐ ఓపెన్ కాన్వొకేషన్' అంటూ డిజిటల్ స్కీన్ ద్వారా ప్రకటించారు. అనంతరం వేడుకలు ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ యూనివర్సిటీ వార్షిక నివేదికను వెల్లడించారు. అనంతరం మాట్లాడుతూ.. సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా మానవతా విలువలు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కలగలిపి ఆధునిక గురుకుల విద్యావిధానం ద్వారా సత్యసాయి విద్యాసంస్థలలో ఆదర్శమైన విద్యను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన అవిష్కరణలు, పరిశోధనా రంగాల వైపు దృష్టి కేంద్రీకరించామన్నారు. 2020 జాతీయ విద్యా విధానం మేరకు కొత్తగా ఐదు కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. బీఈ మ్యాథమ్యాటిక్స్ అండ్ టెక్నాలజీ, డాటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయో సైన్సెస్ అండ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్స్, సీఎస్ఐఆర్, యూజీసీ, నీట్ తదితర పరీక్షల్లో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. అనంతరం చాన్సలర్ చక్రవర్తి అడ్మిషన్ ఆఫ్ గ్రాడ్యుయేషన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్నాతకోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.



మెడల్స్‌తో సత్యసాయి మహాసమాధి చెంత విద్యార్థులు

ప్రతిభకు పట్టాభిషేకం..

స్నాతకోత్సవంలో భాగంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 22వ మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. బంగారు పతకాలు పొందిన వారిలో దీశెట్టి సాయి నందన్, పోడూరు శేష సాయి, హెచ్ శ్రీరాం, కొప్పోలు మణికంఠ, ఆకాశ్ బైరాగి, సత్యనారాయణ నారాయణ, సాహిల్ ప్రధాన్, అగవేంటి భార్గవ్, జుట్టు ఆదర్శ వర్మ, మైనక్ ముఖర్జీ, కోళ్ల వినయ్ సాయి, విక్రమ్ కృష్ణ, రితు రాజ్ ప్రధాన్, మద్దూరి సాయి శ్రీ దత్తా, కుమారి యుక్తి భరద్వాజ్, నేతేటి కేశవాణి, గుగ్గిలం శ్రీచందన్ కృష్ణ, బెల్లపు రవ్వల శ్రేయ, చెరుకూరి సాయి కార్తిక్, శ్రీరామ్ కోరి, నితిన్ నిత్య హర్ష ఉన్నారు. వీరికి యూనివర్సిటీ చాన్సలర్ చక్రవర్తి, ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్ పతకాలు ప్రదానం చేశారు. పరిశోధనా రంగంలో విశేష ప్రతిభ కనభరిచిన 14 మందికి డాక్టరేట్లు అందించారు. అలాగే మరో 436 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టరేట్లు పొందిన వారు వీరే...

సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవంలో పరిశోధనా రంగంలో ప్రతిభ చాటిన పలువురికి చాన్సలర్ చక్రవర్తి, ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్ డాక్టరేట్లు ప్రదానం చేశారు. డాక్టరేట్లు పొందిన వారిలో డెన్నీ జార్జి, రోషన్ రాయ్, వి.సాయిరామ్, హిరాక్ దూషి, వి.భాస్కరన్, సీఆర్ సంతోష్, ద్వాలా లోకేశ్వరరావు, పోనపల్లి ప్రశాంతి ప్రభు, ఎంఎస్ సాయి వినోద్, ప్రజాల చేత్రి, పట్నాన దుర్గా ప్రసాద్, ఆకాంక్ష అగర్వాల్, సురేష్ కుమార్ దహాల్ ఉన్నారు.

నిబద్ధతే విజయానికి సోపానం..

నిబద్ధతే విజయానికి సోపానమని, విద్యార్థులంతా తాము ఎంచుకున్న రంగాల్లో క్రమశిక్షణతో ముందుకు సాగాలని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ పిలుపునిచ్చారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ సందేశాన్నిచ్చారు. క్రమశిక్షణ, సేవానిరతి, మానవతా విలువలు కలగలిపి బోధించే సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుకున్న వారంతా ఎంతో అదృష్టవంతులన్నారు. విద్యార్థులంతా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ప్రతి విద్యార్థీ సానుకూల దృక్పథంలో ముందుకు నడవాలన్నారు. ప్రతి అడుగూ సమాజహితం కోసం వేయాలని పిలుపునిచ్చారు.



బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు



బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న మహిళా విద్యార్థులు



పట్టాలు పొందిన విద్యార్థులు



సేతురామన్ పంచనాథన్‌ను సన్మానిస్తున్న సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు

అతిథులకు స్వాగతం



స్నాతకోత్సవానికి విచ్చేస్తున్న యూనివర్సిటీ గవర్నింగ్ బాడీ,అకడమిక్ కౌన్సిల్,మేనేజ్‌మెంట్ సభ్యులు,ముఖ్య అతిథి సేతురామన్ పంచనాథన్






ప్రముఖుల చేతుల మీదుగా బంగారు పతకాలు, డాక్టరేట్లు అందుకున్న విద్యార్థులు

నేడు సత్యసాయి జయంతి

- ఏర్పాట్లు పూర్తి చేసిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్
- సర్వాంగసుందరంగా ముస్తాబైన ప్రశాంతి నిలయం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



ప్రశాంతి నిలయం: ప్రేమ మూర్తిగా.. సేవా స్ఫూర్తిగా.. ఆధ్యాత్మిక చైతన్య దీప్తిగా భక్తుల మదిలో కొలువైన సత్యసాయి 99వ జయంతి వేడుకలకు ప్రశాంతి నిలయం ముస్తాబైంది. శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. సత్యసాయి సమాధిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేస్తున్నారు.

జయంతి వేడుకలు ఇలా ...

సత్యసాయి 99వ జయంతి వేడుకలు సాయికుల్వంత్ సభా మందిరంలో శనివారం ఉదయం 8 గంటలకు వేదపఠనంతో ప్రారంభమవుతాయి. 8.20 గంటలకు సత్యసాయి విద్యార్థులు గురువందనం కార్యక్రమం ఉంటుంది. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ట్రస్ట్ వార్షిక నివేదికను వెల్లడిస్తారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య ప్రసంగిస్తారు. ఆ తర్వాత ముఖ్య అతిథి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవ కోసం చేపట్టిన సత్యసాయి దివ్యాంగ్‌జన్ పథకం ద్వారా వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తారు. సత్యసాయి 'ప్రేమతరు' పేరుతో 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహణ ఉంటుంది. అలాగే సత్యసాయి పూర్వపు ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు.

సాయంత్రం స్వర్ణ రథోత్సవం

సాయంత్రం 5 గంటలకు ప్రశాంతి నిలయం పురవీధుల్లో సత్యసాయి బంగారు రథం ఊరేగింపు, సాయికుల్వంత్ సభా మందిరంలో జోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం లాల్ గుడి కృష్ణ, లాల్ గుడి విజయలక్ష్మి దంపతుల వయొలిన్ కచేరీ ఉంటుంది. ఆ తర్వాత మహా మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.

గవర్నర్‌కు ఘన స్వాగతం

సత్యసాయి 99వ జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం రాత్రి పుట్టపర్తి చేరుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయంలోని సాయి శ్రీనివాస అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న ఘన స్వాగతం పలికారు. శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో జరిగే సత్యసాయి జయంత్యుత్సవాల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు అరికట్టండి

- సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులకు అడ్డుకట్ట వేయాలి
- రౌడీషీటర్ సాలక్కగారి శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ రత్నను కోరిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఎస్పీ రత్నకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, మహిళలని కూడా చూడకుండా టీడీపీ నాయకులు దాష్టీకాలకు తెగబడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎస్పీ రత్నను కోరారు. శుక్రవారం అయన బాధితులతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ రత్నను చాంబర్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. రౌడీషీటర్, టీడీపీ హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్క గారి శ్రీనివాసులు కొత్తచెరువులో చెలరేగిపోతున్నాడన్నారు. భూ ఆక్రమణలతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. ఎవరైనా ప్రశ్నించినా, ఎదురు తిరిగినా దాడులకు తెగబడుతున్నాడన్నారు. అలాగే కొందరు టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ నేతలను అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెడుతున్నారని, వారందరిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొత్తచెరువులో టీడీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, మరికొంత మంది టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారన్నారు. ఇళ్లలోకి ప్రవేశించి మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పోలీసులకు అన్నీ తెలిసినా తెలియనట్టు ఉండిపోయారన్నారు.

అసెంబ్లీలో మాత్రం గొప్పలు..

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత తమ ప్రభుత్వంలో మహిళలకు న్యాయం చేస్తున్నామని అసెంబ్లీలో ఊదరగొడుతుండగా, క్షేత్ర స్థాయిలో మాత్రం కూటమి పార్టీల నాయకులు మహిళలపై దాడులకు తెగబడుతున్నారన్నారు. ఓడీచెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్‌లోని ఒక స్థలం వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని, అయినా అధికార పార్టీ అండతో రామచంద్ర, వీరయ్య ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పుట్టపర్తి నియోజవర్గంలో హింసాత్మక ఘటనలు, దౌర్జన్యాలు జరగలేదని, ఇప్పుడు మాత్రం అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు దాడులను ప్రోత్సహిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామన్నారు. దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వెంట మన్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, ఓడీచెరువు జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, గంగాద్రి, నరసారెడ్డితో పాటు బాధితులు ఉన్నారు.

క్లుప్తంగా

పత్తి నిల్వలు దగ్ధం


షెడ్డులోనే పూర్తిగా కాలిపోయిన పత్తి నిల్వలు

గుడిబండ: మల్బరీ షెడ్డులో నిల్వ చేసిన పత్తి దిగుబడులు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. గుడిబండ మండలం తాళికెరలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సురేంద్ర తనకున్న రెండు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాడు. మార్కెట్‌లో ధర పెరిగిన తర్వాత పత్తిని విక్రయించాలనుకున్న ఆయన... తన పొలంలోనే నిర్మించిన మల్బరీ షెడ్డులో పత్తి నిల్వలను భద్రపరిచాడు. శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగడంతో పత్తితో పాటు మల్బరీ షెడ్డు కాలిపోయింది. దీంతో రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి, సెరికల్చర్ ఏడీ రాజు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పశువుల తరలింపును అడ్డుకున్న గో రక్షణ సమితి


పట్టుబడిన వాహనంతో పోలీసులు, గోరక్షణ సమితి సభ్యుడు రఘురాంశర్మ

నల్లచెరువు: తెలంగాణా నుంచి కేరళకు అక్రమంగా తరలిస్తున్న 29 పశువులను శుక్రవారం నల్లచెరువు సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద తమిళనాడు గో రక్షణ సమితి సభ్యుడు ఆర్.రఘురాం శర్మ అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపిన మేరకు... ఐచర్ వాహనంలో పశువులను తరలిస్తున్నారన్న సమాచారంతో అప్రమత్తమైన రఘురాంశర్మ నల్లచెరువు వద్ద అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవులను అన్నమయ్య జిల్లా తంబాళ్లపల్లి గ్రామం వద్ద ఉన్న నవశక్తి పీఠం గోశాలకు తరలించారు.

నేటి నుంచి కొనకొండ్లలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

వజ్రకరూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు వజ్రకరూరులోని జెడ్పీహెచ్‌ఎస్ సిద్ధమైంది. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు హెచ్‌ఎం వేణుగోపాల్, పీఈటీలు సత్యనారాయణ, కళాసుధాకర్ వెల్లడించారు. పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు హాజరు కానున్నారు.


పాముర్రాయి వద్ద నేల వాలిన వరి పంట

వరి... మిగిల్చింది వర్రీ

వరి పంట చేతికొస్తే కష్టాలు గట్టెక్కుతాయన్న రైతన్నల ఆశలపై అకాల వర్షాలు నీళ్లు చల్లాయి. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలతో వరిలో దిగుబడి గణనీయంగా తగ్గింది. కోతకు వచ్చిన వరి పంట గాలుల ఉధృతికి ఎక్కడికక్కడ తలవాల్చడంతో వడ్లు రాలిపోయాయి. దీంతో రైతులు యంత్రాలను ఏర్పాటు చేసి పంట కోతలు చేపట్టారు. చేతికి వచ్చిన అరకొర ధాన్యాన్నే రహదారిపై ఆరబోశారు. అకాల వర్షాలు రాకుంటే ఆశించిన మేర పంట చేతికొచ్చి కష్టాలు గట్టెక్కేవని పాముర్రాయికి చెందిన రైతు ఆదినారాయణ తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఇటీవల పెనుగాలులతో కూడిన వర్షానికి నేలకు అతుక్కుపోయిన వరి పంట, హార్వెస్టర్ సాయంతో చేపట్టిన వరి కోతలు


జంతలూరు వద్ద రహదారిపై ఆరబోస్తున్న వరిధాన్యం

ప్రజలంటే అంత చులకనా?

- మంత్రి సవితా వ్యాఖ్యలు దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీని అమలు చేయకపోయినా పర్వాలేదు కానీ, ప్రజలపై నిందలు వేయడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శాసన మండలిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో డీబీటీల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రజలు గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారంటూ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని అన్నారు. అమ్మఒడి, చేయూత, మహిళా సంఘాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు, వసతి దీవెన, విద్యా దీవెన పథకాల లబ్ధి చేకూరిన విద్యార్థులు, కులవృత్తులపై ఆధారపడిన వారికి, వృత్తిలో స్థిరపడాలనుకున్న న్యాయవాదులకు పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేశారన్నారు. మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలు అప్పటి సంక్షేమ ఫలాల లబ్ధి పొందిన వారి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. మద్యానికి ప్రజలను బానిసలను చేసే నైజం టీడీపీకే చెల్లుతుందన్నారు. ఇందుకు సోమందేపల్లిలో మంత్రి సవిత భర్త స్వయంగా మద్యం షాపులను ప్రారంభించిన అంశాలే అద్దం పడుతున్నాయన్నారు. గంజాయి, మద్యం పేరుతో రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, న్యాయవాదులను అవమానించే రీతిలో మాట్లాడి బీసీల పింఛన్‌లపై స్పష్టత ఇవ్వకుండా దాట వేయడం బీసీ సంక్షేమ శాఖకు మంత్రిగా ఉన్న సవితకే చెల్లుబాటవుతుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వకపోయిన పర్వాలేదు కానీ, ప్రజలను ఉద్దేశించి కించపరిచేలా మాట్లాడడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి బేషరతుగా వారందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

- చెక్‌డ్యామ్‌లో నీట మునిగి విద్యార్థి మృతి


చరణ్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. వివరాలు... గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి చెందిన గోవిందు, శకుంతల దంపతులకు కుమారుడు చరణ్ (14), ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న చరణ్... శుక్రవారం తన స్నేహితులు ఈతకు వెళుతున్నారన్న విషయం తెలుసుకుని బడి ఎగ్గొట్టి వారితో పాటు సైకిల్‌పై గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఈత కొట్టేందుకు సిద్ధమవుతుండగా అక్కడే ఉన్న సమీప బంధువులైన గొర్రెల కాపరులు వారించారు. అయినా తనకు ఈత వస్తుందని బుకాయించాడు. వద్దని వాళ్లు గట్టిగా చెప్పడంతో చేసేదేమీ లేక చెక్‌డ్యాం వద్ద కూర్చొని కాళ్లు నీళ్లలో పెట్టి ఆడుకుంటూ కూర్చొన్నాడు. ఈ క్రమంలో బంధువుల దృష్టి ఏమార్చి నీళ్లలోకి దిగిన చరణ్ కాసేపు ఈత కొడుతూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీట మునిగాడు. మిగిలిన పిల్లలు కేకలు వేయడంతో గొర్రెల కాపరులు నీటిలో దిగి గాలింపు చేపట్టినా చరణ్ జాడను పసిగట్టలేకపోయారు. దీంతో చుట్టుపక్కల పొలాల్లో పనుల్లో నిమగ్నమైన రైతుల సాయం తీసుకుని మరోసారి చెక్‌డ్యాంలోకి దిగి దాదాపు గంటన్నర సేపు గాలించిన అనంతరం చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. అప్పటికే విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు భారీగా అక్కడకు చేరుకున్నారు. చరణ్ ప్రాణాలతో ఉన్నాడనే అనుమానంతో కుటుంబసభ్యులు గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు మురళి

చెన్నేకొత్తపల్లి: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... సీకేపల్లి మండలం దామాజిపల్లి – యర్రంపల్లి గ్రామాల మధ్య రైలు పట్టాలపై శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన కీమ్యాన్ సమాచారంతో హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం సమీపంలో పడి ఉన్న ప్లాస్టిక్ కవర్‌లో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడిని రామగిరి మండలం పోలేపల్లికి చెందిన చాకలి మురళి (32)గా గుర్తించారు. మృతునికి భార్య అంబిక, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'బనానా రైలు' ప్రారంభం


అరటి ఎగుమతుల గూడ్స్ బండిని ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా

తాడిపత్రి రూరల్: అరటి ఎగుమతులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక గూడ్స్ రైలును (బనానా రైలు) తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు జెండా ఊపి రైలును ప్రారంభించారు. వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, హార్టీకల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఏపీఈడీపీ జీఎం వినీత సుధాన్షు, కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అనీష్‌అగర్వాల్, ఆర్డీఓ కేశవనాయుడు, హార్టీకల్చర్ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్‌ఖాన్, రైల్వే స్టేషన్ మాస్టర్ అనిల్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అనూప్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక రైతు ఆత్మహత్య

ఉరవకొండ: అప్పులు తీర్చే మార్గం కానరాక ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (51) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకున్న 8 ఎకరాల పొలంలో గత రెండేళ్లుగా మిరప, వేరుశనగ, పప్పుశనగ తదితర పంటలను రైతు వెంకటేష్ సాగు చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు చవిచూడడంతో అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో ఎలాగైనా రుణ విముక్తి పొందాలనుకున్న ఆయన... మరి కొంత అప్పు చేసి గొర్రెల పోషణ చేపట్టాడు. అయితే అనారోగ్యం కారణంగా 20 గొర్రెలు మృతి చెందాయి. పంటల సాగు, గొర్రెల పోషణకు చేసిన అప్పులు రూ.10 లక్షలకు చేరుకోవడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ కుటుంబసభ్యులతో చెప్పుకుని గురువారం బాధపడ్డాడు. అనంతరం అదే రోజు రాత్రి పొలం వద్ద ఉన్న జీవాల దొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భోజనం తీసుకుని వెళ్లిన కుటుంబసభ్యులు గమనించి వెంటనే వెంకటేష్‌ను ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, వెంకటేష్‌కు భార్య గంగమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


నాటికలోని సన్నివేశాలు




అలరించిన 'తత్ త్వం అసి'

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 43 స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల సందర్భంగా సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు స్నాతకోత్సవ నాటికను ప్రదర్శించారు. 'తత్ త్వం అసి' పేరుతో ప్రదర్శించిన రూపకం భక్తులను ఆలోచింపజేసింది. మానవుడు స్వార్థం, కోపం, అసూయ వంటి దుర్గుణాలను వీడినప్పుడే జీవితంలో సంపూర్ణ ఆనందాన్ని పొందుతాడంటూ సందేశాన్నిస్తూ సత్యసాయి బోధనలు చక్కగా వివరించారు.

వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్


ఎన్నికైన వీఆర్‌ఏల జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

పుట్టపర్తి అర్బన్ : వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీజేఏసీ అధ్యక్షుడు మధునాయక్, ప్రధాన కార్యదర్శి మైనుద్దీన్ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో ఎన్నికలను ఏకగ్రీవం చేశారు. అధ్యక్షుడిగా ఎ.గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్, సహ అధ్యక్షుడిగా కాంతరాజు, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, ఆంజనేయులు, మారుతీ ప్రసాద్, కేశవప్రసాద్, నరసింహులు, ట్రెజరర్‌గా సుదర్శనరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా అశ్వని, రెడ్డెప్ప, మణిపద్మ, రమణ, చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా మల్లికార్జునరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చిన్నాగప్ప, ఆంజనేయులు, ప్రభావతి, పోతులయ్య, బాబు, పాపయ్యను ఎన్నుకున్నారు.

ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. విద్యార్థి దుర్మరణం


అఖిల్ (ఫైల్)

పెనుకొండ: ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామానికి చెందిన వడ్డె నాగరాజు కుమారుడు అఖిల్ (13) పెనుకొండలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజూ సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్కూల్‌కు సైకిల్‌పై బయలుదేరిన అఖిల్ గ్రామ శివారులోని చెరువు కట్ట వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌కు దారి వదిలేందుకు రోడ్డు పక్కన ఆపిన ఘనగిరి పాఠశాల బస్సు వెనుక నిలబడ్డాడు. ట్రాక్టర్ వెళ్లడానికి దారి లేకపోవడంతో బస్సు డ్రైవర్ ఉన్నఫళంగా తన వాహనాన్ని వేగంగా రివర్స్ చేశాడు. సైకిల్‌పై నిల్చొన్న అఖిల్ ప్రమాదాన్ని గుర్తించేలోపు బస్సు వెనుక చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న గ్రామస్తులు వెంటనే బాలుడిని పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అఖిల్ మృతి చెందినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా హొన్నూరు షంషేర్ వేడుక


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సర్మస్ హుస్సేనీ స్వామి షంషేర్, దేవుడి సవారీ కార్యక్రమాలు ఘనంగా సాగాయి. తెల్లవారుజామున దేవుడి సవారీ, షంషేర్‌ను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో దర్గాహొన్నూరు గ్రామం జనసంద్రమైంది. స్వామి సమాధిని దర్శించుకుని పూల మాలలు సమర్పించి, చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి


షంషేర్ ఊరేగింపు దృశ్యం